

# మనం

తూర్పు పశ్చిమ, కృష్ణ జిల్లాలు
శుక్రవారం 27- 06 - 2025
4 పేజీలు



# అమ్మవారి సన్నిధిలో ఆషాడమాస పూజలు





## తొలి ఆషాడ సారె అమ్మవారికి బహుకరించిన ఈవో శీనా నాయక్ దంపతులు

**ఇంద్రకీలాద్రి, జూన్ 26. (మనం ప్రతినిధి) :** ఆషాడ మాసం ప్రారంభ నేపధ్యంలో గురువారం దుర్గమ్మ వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకు జాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ఉద్యోగుల తరుపున కార్య నిర్వహణ అధికారి స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ సీనా నాయక్ దంపతులు అమ్మవారికి తొలి ఆషాడ మాస సారె బహుకరించారు. ఇంద్రకీలాద్రి పై కొలువైన శ్రీ కనకదుర్గమ్మవారిని ఇంటి ఆడపడుచుగా భావించి ఆషాఢ మాసం సందర్భంగా భక్తులంతా ఆషాఢసారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఆషాఢ మాసం ప్రారంభం సందర్భంగా గురువారం ఉదయం 8 గంటలకు మొదటగా ప్రత్యేక పూజలు అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రధాన ఆలయం నుండి మహామండపం 6 వ అంతస్తులోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. దేవస్థానం సిబ్బంది తరుపున మొదటి సారె ను ఆలయ కార్యనిర్వహణాధికారి వి. కె.శీనానాయక్ దంపతులు, దేవస్థానం సిబ్బంది కుటుంబాలతో విచ్చేసి అమ్మవారి కి సమర్పించారు. ప్రధాన ఆలయం నుండి సారె సంభారాలుతో మహా మండపం చేరి అమ్మవారికి నివేదన చేసి, భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో ప్రధాన అర్చకులు ఎల్. దుర్గా ప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు కోట ప్రసాద్, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ సి హెచ్ రంగారావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ బి. వెంకట రెడ్డి, ఎన్. రమేష్ బాబు, ఎం. తిరుమల రావు, శ్రీనివాస్, కె. గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. అర్చకులు భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ, సామూహిక ఆశీర్వచనం అందజేశారు.

# పాలకొల్లులో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం ర్యాలీ



## జండా ఊపి ప్రారంభించిన మంత్రి నిమ్మల



**పాలకొల్లు, జూన్ 26,మనం ప్రతినిధి :** పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీకి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల జోలికి యువత వెళ్లకుండా ప్రతిజ్ఞ చదువుతూ అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ, మున్సిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.కూటమి నాయకులు పి బాబు, జీవి,యూ కబర్ది, రజని, సూర్యనారాయణ రాజు, పెద్దిరాజు, బోనం నర్సయ్య, రామ లింగేశ్వరావు,పద్మారావు తాసిల్దార్ ఎడ్ల దుర్గా కిషోర్, మున్సిపల్ కమిషనర్ బి విజయ సారధి, సిఐలు కే రజని కుమార్, మద్దాల శ్రీనివాస్, జి శ్రీనివాస్,ఎస్ఐలు సిబ్బంది పాలకొల్లు లజపతిరాయ్ పేట మాంటిస్సోరి స్కూల్, మరియు కళాశాల విద్యార్థులు, అధినేత కే వి కృష్ణ వర్మ, శ్రీ విశ్వ విద్యార్థులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ



**జంగారెడ్డిగూడెం రూరల్ జూన్ 26(మనం న్యూస్)** :జంగారెడ్డిగూడెం లో గురువారం మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ సందర్భంగా పలు విద్యాసంస్థల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు స్థానిక మసీద్ వద్ద మానవహారం చేపట్టారు యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎమ్మార్వో స్లీవ జోజి డీఎస్పీ రవిచంద్ర మున్సిపల్ కమిషనర్ కేవీ వెంకటరమణ అన్నారు ఈ కార్యక్రమంలో ఎక్సేంజ్ అధికారులు మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు ఘన స్వాగతం పలికిన మంత్రి డాక్టర్ నిమ్మల



**పాలకొల్లు, జూన్ 26, మనం ప్రతి**నిధి: అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు పనుల ప్రారంభోత్సవం కోసం రాజమండ్రి చేరుకున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు రాజమండ్రి ఎయిర్పోర్ట్ లో గురువారం ఘన స్వాగతం పలికారు. ఈ మేరకు ఆ వివరాలను మంత్రి కార్యాలయం ప్రతి నిధులు స్థానిక విలేకరులకు తెలిపారు. స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఉన్నట్లు తెలిపారు.

## మార్పును వేడుక చేసుకునే, మీరేంటో చాటుకునే

# సాహసోపేత కొత్త గుర్తింపును ఆవిష్కరించిన బటర్ ఫ్లై

**విశాఖపట్నం జూన్ 26 ( మనం న్యూస్ ) :**భారతదేశ అత్యంత విశ్వసనీయమైన వంటగది ఉపకరణాల బ్రాండ్లలో ఒకటైన బటర్‌ఫ్లై ఒక కొత్త పేజీని తిరగేస్తోంది. రిఫ్రెష్ చేయబడిన బ్రాండ్ గుర్తింపు, పునరుద్ధరించబడిన ఉద్దేశ్యం, నేటి నిరంతరం మార్పు చెందుతున్న వినియోగదారుని గురించి మరింత స్పష్టమైన అవగాహనతో. ఈ రిఫ్రెష్ కు గుండెకాయలా ఒక చిహ్నం ఉంది, అది కాలానికి అతీతంగా పరివర్తన చెందేది %-% ఫింగర్ ప్రింట్. అది సీతాకోకచిలుక రెక్కలలో అందంగా విలీనం అవుతుంది. అభివృద్ధి చెందిన ఐకాన్ బ్రాండ్ ప్రధాన నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది: జీవితం మారుతున్నప్పటికీ, ఒకరి అసలైన రూపం అలాగే ఉంటుంది. ఈ వ్యక్తిగత ముద్ర - ఒకరి ఆలో చనా విధానం, వంట చేయడం, సృష్టించడం మరియు జీవించడం - దాన్నేఇప్పుడు బటర్‌ఫ్లై వేడుక చేసుకుంటోంది. బటర్‌ఫ్లై యొక్క ఈ కొత్త శకం జీవితం పట్ల 'జిల్లెనియల్' వైఖరి కలిగిన వినియోగదారులతో నేరుగా మాట్లాడుతుంది వాళ్లు- తాము ఎవరో అనే దానిలో పాతుకుపోయి పరివర్తనను స్వీకరించే స్వీయ-అవగాహన కలిగిన వ్యక్తులు. వారికి, మార్పు స్థిరంగా ఉంటుంది - కానీ ప్రామాణికత అనేది చర్చించలేనిదిగా ఉంటుంది. జనాభాను దాటి సైకో గ్రాఫిక్స్‌కు వెళ్లడం ద్వారా వయస్సుపై కాకుండా వైఖరిపై దృష్టి పెట్టడం ఈ బ్రాండ్ లక్ష్యం - ఎందుకంటే జిల్లెనియల్ మనస్తత్వం సంఖ్యలు, సరిహద్దులు లేదా లింగాల ద్వారా నిర్వచించబడదు, కానీ మార్పును ఎలా స్వీకరిస్తారనే దాని ద్వారా నిర్వచించ బడుతుంది.బటర్‌ఫ్లై యొక్క రిఫ్రెష్డ్ పొజిషనింగ్, 'సెలబ్రేటింగ్ చేంజ్' అనేది ఆధునిక భారతీయ గృహాల లోతైన అవగాహనను ప్రతిబింబిస్తుంది. ఇక్కడ మారుతున్న పాత్రలు, హైబ్రిడ్ జీవనశైలి, టెక్-ఇంటిగ్రేటెడ్ లివింగ్ ప్రమాణం అనేవి సాధారణ మైపోతాయి. గృహోపకరణాల్లో భారతదేశ ప్రముఖ సంస్థల్లో ఒకటైన క్రాంప్టన్ అనుబంధ సంస్థగా, బటర్‌ఫ్లై ఇప్పుడు వంటగదిలో మరియు అంతకు మించి రోజువారీ అనుభవాలను మార్చే సహజమైన, ఉద్దేశపూర్వక ఆవిష్కరణలను తీసుకురావడానికి సన్నద్ధమైంది. 40 సంవత్సరాలకు పైగా, బటర్‌ఫ్లై భారతదేశం అంతటా లక్షలాది వంటశాలలలో భాగంగా ఉంది. నేడు, ఇళ్లు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గుర్తింపులు మరింత స్వీయ-నిర్వచితాలవుతున్నాయి. ఈ నేపథ్యంలో మా కొత్త గుర్తింపు మనం ఎవరో మాత్రమే కాకుండా - మనం ఎవరి కోసం ఇక్కడ ఉన్నామో కూడా ప్రతిబింబిస్తుంది" అని బటర్‌ఫ్లై చీఫ్ బిజినెస్ ఆఫీసర్ శ్వేతా సాగర్ అన్నారు. కొత్త బటర్‌ఫ్లై లోగో కేవలం ఒక చిహ్నం కంటే ఎక్కువ - ఇది మిలియన్ల మంది వినియోగదారులు, రిటైలర్లు, డీలర్లు, ఉద్యోగులు మరియు బటర్‌ఫ్లై ఉత్పత్తులను తయారు చేస్తున్న డిజైనర్ల గుర్తు. ఫింగర్ ప్రింట్ విభిన్న రేపురేఖల నుండి రూపొందించబడిన సీతాకోకచిలుక రెక్కలు ఇప్పుడు అది తాకిన ప్రతి వ్యక్తి కథను కలిగి ఉంటాయి. జీవితం ఎంత మారిపోయినా, ఒకరి గుర్తింపు అనేది వంటగది మరియు రోజువారీ లయపై ఒక ముద్ర వేస్తుందనే ఆలోచనకు ఇది ప్రతిరూపం. "ఇది రీబ్రాండ్ కంటే ఎక్కువ. ఆధునిక భారతీయ వంటగదిలో ఉండటం అంటే ఏమిటో తిరిగి ఊహించుకోవడం. అసలైన వారి కోసమే బటర్ ఫ్లై. ఎదుగుతూ, మారుతూ, అలవాటు పడుతూ, తాము ఎవరో అనే సారాన్ని ఎప్పటికీ కోల్పోని వారే అసలైన వారు" అని ఆమె అన్నారు. మిక్సర్ గ్రైండర్ల నుండి కుక్‌టాప్‌ల వరకు, బటర్‌ఫ్లై ఉత్పత్తి శ్రేణి వివిధ వర్గాలలో పరివర్తన చెందుతోంది - అవి సమకాలీన ఇళ్ల మారుతున్న లయలకు అనుగుణంగా, మరింత సహజమైన, మన్నికైన మరియు డిజైన్-ఫార్వర్డ్‌గా రూపొందించబడ్డాయి. బ్రాండ్ యొక్క నిబద్ధత మాత్రం అలాగే ఉంది: వినియోగదారులను అర్థం చేసుకుని, అభివృద్ధి చెందే తెలివైన పరిష్కారాలను అందించడం ద్వారా రోజువారీ జీవితాన్ని మెరుగుపరచడం. బటర్‌ఫ్లై గాంధీమతి అప్లియెన్సెస్ లిమిటెడ్ గురించి: 'బటర్‌ఫ్లై' భారతదేశంలోని వంటగది మరియు చిన్న డొమెస్టిక్ అప్లియెన్సెస్ లో ప్రముఖ 3 బ్రాండ్‌లలో ఒకటి. ఇది దక్షిణాదిలో అధిక వినియోగదారుల రీకాల్‌తో ప్రసిద్ధి చెందిన బ్రాండ్. అందం మరియు ఉత్పత్తి నాణ్యతకు ప్రసిద్ధి చెందింది. వినియోగదారుల అవసరాలను తీర్చడానికి అనుగుణంగా ఉండే వేరియంట్‌లతో ఇది విభిన్న ఉత్పత్తి పోర్ట్‌ఫోలియోను కలిగి ఉంది. ఇది 4 ప్రధాన ఉత్పత్తులను కలిగి ఉంది - మిక్సర్ గ్రైండర్లు, ప్రెజర్ కుక్కర్లు, గ్యాస్ స్టవ్, వెట్ గ్రైండర్లు. అంతేగాకుండా చిన్న గృహోపకరణాల పూర్తి సూట్‌తో మద్దతు ఇస్తుంది. ఇది బలమైన బ్యాక్‌వర్డ్ ఇంటిగ్రేషన్‌తో అత్యాధునిక ఇన్-హౌస్ తయారీ సెటప్‌ను కలిగి ఉంది.

# పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగిన 1యం1బి జాబ్ మేళాలో పాల్గొన్న 400 మందికి పైగా యువ ఉద్యోగార్థులు

పశ్చిమ గోదావరి జిల్లాల యువతకు దాదాపు 300 ఉద్యోగ అవకాశాలను అందించింది.

త్వరలో పశ్చిమ గోదావరిలో ఒక "జాబ్ రెడినెస్ సెంటర్





**పశ్చిమ గోదావరి జూన్ 26( మనం న్యూస్ ) :** నైపుణ్య లోటును తీర్చడం మరియు యువతకు ఉద్యోగయోగ్యతను పెంపొందించడంలో మైలురాయిగా నిలిచిన ఈ కార్యక్రమంలో, ఐక్యరాజ్యసమితి గుర్తింపు పొందిన 1యం1బి (వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్) సంస్థ, విశ్వ తేజ డిగ్రీ కాలేజీ, పెనుగొండ, నరసాపురం తో కలిసి, పశ్చిమ గోదావరి జిల్లాలో తొలి 1యం1బి జాబ్ మేళాను గురువారం, జూన్ 26న నిర్వహించింది. ఈ జాబ్ మేళా యువ ఉద్యోగార్థులకు అనేక రంగాలలో ఉద్యోగ అవకాశాలను కల్పించి, వారి జీవితాలను మార్చే దిశగా ముందడుగు వేసింది. ఒక రోజు పాటు కొనసాగిన ఈ జాబ్ మేళాలో కాలేజీ ప్రముఖులు మరియు 1యం1బి బృంద సభ్యులు పాల్గొన్నారు. పెనుగొండ, ఉండి, నరసాపురం, భీమవరం వంటి ప్రాంతాల నుండి వచ్చిన యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ జాబ్ మేళా యొక్క ముఖ్య ఉద్దేశ్యం, ముఖ్యంగా తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాల యువతకు ఉద్యోగ అవకాశాలను అందించడమే. తయారీ, రిటైల్, ఎలక్ట్రానిక్స్, టెలికాం, BFSI, సేల్స్ వంటి అనేక రంగాలలో 300 కి పైగా ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. అదనంగా, హాజరైన అభ్యర్థులు కెరీర్ మార్గదర్శకత్వం, నైపుణ్యాభివృద్ధి వంటి ఇంటరాక్టివ్ సెషన్లలో పాల్గొని, కార్పొరేట్ సంస్కృతి, ఇంటర్వ్యూ సిద్ధతపై విలువైన సమాచారాన్ని పొందారు. ఈ కార్యక్రమం సందర్భంగా అనేక అభ్యర్థులు ఎంపికయ్యారు మరియు తదుపరి నియామక దశలకు పంపించబడతారు. ఎంపికైన అభ్యర్థులను ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ మరియు తమిళనాడు రాష్ట్రాలలో నియమించనున్నారు. 1యం1బి వ్యవస్థాపకుడు మనవ్ సుబోధ్, ఈ కార్యక్రమంపై ఆనందం వ్యక్తం చేస్తూ : "1యం1బి జాబ్ మేళా అనేది యువ ఉద్యోగార్థులకు మరియు ప్రముఖ నియామక సంస్థలకు మధ్య ఒక ముఖ్యమైన వేదికగా మారింది. అంతేకాకుండా, మేము వారిని అవసరమైన సాఫ్ట్ స్కిల్స్ మరియు ప్రొఫెషనల్ శిక్షణతో సమృద్ధిగా తయారు చేస్తున్నాం. యువత మరియు కంపెనీల అద్భుతమైన పాల్గొనడం చాలా ప్రేరణ కలిగించే విషయం. జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ మద్దతుతో ఇది ఒక ప్రారంభం మాత్రమే - పశ్చిమ గోదావరి యువతకు మరిన్ని అవకాశాలు కల్పించడమే మా లక్ష్యం. అని అన్నారు. ఇలాంటి మరిన్ని జాబ్ మేళాలను నిర్వహించడమే కాకుండా, 1యం1బి త్వరలో పశ్చిమ గోదావరిలో ఒక "జాబ్ రెడినెస్ సెంటర్"ను కూడా ఏర్పాటు చేయనుంది. గత నెల తూర్పు గోదావరి జిల్లా మల్కిపురంలో నిర్వహించిన 1యం1బి జాబ్ మేళాలో 350 మంది యువ ఉద్యోగార్థులు పాల్గొని, 200 ఉద్యోగ అవకాశాలు అందించబడ్డాయి. ఈ జాబ్ మేళాల కార్యక్రమం, యువతకు స్థిరమైన, మంచి పారితోషికం కలిగిన ఉద్యోగాలు కల్పించి, ఆర్థిక అభివృద్ధి, దీర్ఘకాలిక కెరీర్ అభివృద్ధి లక్ష్యంగా నడుస్తోంది.

# అటవీ ప్రాంతాల అభివృద్ధికి కృషి

- శిక్షణ కేంద్రం శాశ్వత భవనానికి శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



**రాజమహేంద్రవరం, మనం న్యూస్, జూన్ 27 :**రాష్ట్రంలో 23 శాతం భూ భాగం పచ్చదనంతో కలిగి ఉండేలా చర్యలు తీసుకోవడం లో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలో అటవీ ప్రాంతాల అభివృద్ధి దిశగా అడుగులు వేయడం జరుగుతోందనీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక దివాన్ చెరువు అటవీ శాఖ శిక్షణా కేంద్రం లో శిక్షణ కేంద్రం శాశ్వత భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం లో అటవీ అకాడమీ శిక్షణ కేంద్రం శాశ్వత భవనానికి రూ.18 కోట్లతో శంకుస్థాపన చెయ్యడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తు తరాల కోసం పచ్చదనం కలిగిన ప్రాంతాల్ని అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరుగుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారి ఆదేశాల మేరకు మంత్రి మండలి సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్రములో పచ్చదనాన్ని 23 శాతం వరకు పెంచాలనే సంకల్పంతో క్యాబినెట్‌లో ప్రత్యేకంగా నిర్ణయం తీసుకోవడం జరిగిందనీ, అందులో భాగంగా తొలిదశలో అందులో 50 శాతం మేరకు లక్ష్యాలను సాధించేందుకు పకడ్బందీ కార్యాచరణ సిద్ధం చెయ్యడం జరిగిందన్నారు. రాజమహేంద్రవరం లో ఉన్న తాత్కాలిక శిక్షణ కేంద్రం లో రూ. 18 కోట్ల 34 లక్షలతో శాశ్వత శిక్షణా భవనానికి శంకుస్థాపన చెయ్యడం జరుగుతోందని వెల్లడించారు. ఇందుకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారన్నారు. ఈ శిక్షణ కేంద్రం ద్వారా అడవులు స్థిరంగా నిర్వహించడానికి , పచ్చదనం పెంచడం పై అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. అటవీ అధికారులకు , ఫ్రంట్ లైన్ సిబ్బందికి నైపుణ్య అభివృద్ధి వెంటనే ఈ అకామిక్ యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ , ఎమ్మెల్యేలు బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామ కృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, ఎస్పీ డి నరసింహా కిషోర్, అటవీ శాఖ ఉన్నతాధికారులు , విసి %cం% ఎండి, ఎపిఎఫ్‌డిసి డాక్టర్ ఆర్ పి ఖజూరియా , ఎపిసిసిఎఫ్ డాక్టర్ రాహుల్ పాండే, ఎపిసిసిఎఫ్ (హెచ్ఆర్‌డి %cం% డబ్ల్యూఎల్) %cం% చైర్మన్, బిఓసి, ఎ. పి. స్టేట్ ఫారెస్ట్ అకాడమీ (కాంపా) డాక్టర్ శాంతి ప్రియా పాండే, డైరెక్టర్, ఎపి స్టేట్ ఫారెస్ట్ అకాడమీ) డాక్టర్ బి. విజయ్ కుమార్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, రాజమండ్రి సర్కిల్ బి.ఎన్.ఎన్.మూర్తి, ఆర్.ఎం టి. జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.




# గ్రామీణ ప్రాంతాలలో రహదారులు నిర్మించాలి





- సిపిఐ పార్టీ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు

**కొయ్యలగూడెం జూన్ 26(మనం ప్రతినిధి):**గ్రామీణ ప్రాంతాలలో రహదారులు నిర్మించాలని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మండలంలో కొయ్యలగూడెం నుండి కన్నాపురం గ్రామం వెళ్లాలంటే ఏడు కిలోమీటర్ల మేర ఉన్న ఈ రహదారి అస్తవ్యస్తంగా తయారయిందని, పాలకులు మారుతున్నప్పటికీ రోడ్ల నిర్మాణ పనులు మాత్రం జరగడం లేదని ఆంజనేయరాజు తెలిపారు. గిరిజన గ్రామాల నుండి గిరిజనులు వారి యొక్క అవసరతలైన, నిత్యవసర వస్తువుల కొనుగోలుకు, మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రులకు,విద్యార్థులు విద్యను అభ్యసించడానికి రావాలంటే పోలవరం నియోజకవర్గంలో ఉన్న ఏజెన్సీ ముఖద్వారం అయినా కొయ్యలగూడెం పట్టణం చేరుకోవాలని పట్టణానికి రావాలంటే కన్నాపురం నుండి కొయ్యలగూడెం రహదారి పెద్ద పెద్ద గోతులతో,దర్శనమిస్తుందని ఈ రహదారిపై ప్రయాణించే వాహన చోదకులు,పాఠశాలలకు, కళాశాలలకు,వెళ్లే విద్యార్థులు, గర్భిణీ స్త్రీలు,ద్విచక్ర వాహనాల వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రహదారి నూతన నిర్మాణానికి మూడు కోట్ల 50 లక్షల రూపాయలు మంజూరు అయ్యిందని,పాలకులు మాటలు చెప్పడం తప్ప వాటిని అమలు పరచడంలో విఫలం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు గ్రామీణ ప్రాంతాలలో రహదారులు నిర్మించాలని ఆదేశాలు జారీ చేస్తున్నా,గ్రామీణ ప్రాంతాలలో రహదారులు మాత్రం అస్తవ్యస్తంగానే ఉన్నాయని తెలిపారు.సంబంధిత అధికారులు రహదారిపై ఏర్పడిన గోతులకు మరమ్మతులు చేసి,నూతన రహదారిని నిర్మించాలని, లేనిపక్షంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ప్రభుత్వాన్ని ఆంజనేయరాజు హెచ్చరించారు.

## 3-ఇన్-1 అడ్వాంటేజ్ తో బజాజ్ ఫిన్ సర్వ్ ఎఎంసి స్మాల్ క్యాప్ ఫండ్

**గాంధీనగర్ జూన్ 26 మనం న్యూస్:** క్వాలిటి, గ్రోత్, విలువను అందించే స్మాల్ క్యాప్ షేర్లలో ప్రధానంగా ఇన్వెస్ట్ చేసే ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ స్కీమ్ బజాజ్ ఫిన్సర్వ్ స్మాల్ క్యాప్ ఫండ్ ను ప్రారంభించినట్లు బజాజ్ ఫిన్సర్వ్ ఏఎంసీ ప్రకటించింది. ఈ ఫండ్ ఈ నెల 27న సబ్స్క్రిప్షన్ కోసం ప్రారంభమై, జూలై 11న ముగుస్తుంది. స్మాల్ క్యాప్స్ లో ఇటీవలి దిద్దుబాటు దీర్ఘకాలిక ఇన్వెస్టర్లకు ఆకర్షణీయమైన ఎంట్రీ పాయింట్ ను అందిస్తుంది. 80 శాతానికి పైగా స్మాల్ క్యాప్ కంపెనీలు 38 శాతం బలమైన లాభాల గ్రోత్ ను, సాలిడ్ రిటర్న్ రేషియోలను నమోదు చేసినప్పటికీ, వాటిలో చాలా వరకు ఇప్పటికీ 52 వారాల గరిష్టానికి 15-45 శాతం దిగువన ట్రేడవుతున్నాయి. ఈ తాజా మార్కెట్ కరెక్షన్ ఈ కంపెనీల వాస్తవ విలువకు, వాటి ప్రస్తుత మార్కెట్ ధరలకు మధ్య స్పష్టమైన అంతరాన్ని తెరిచింది.

## ఆత్రేయపురం లో యోగాంధ్ర కార్యక్రమం ఘన విజయం

ఎంపిడిఒ బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్ వారికి గౌరవ జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం.





**ఆత్రేయపురం జూన్ 26 మనం న్యూస్.** జూన్ 16వ తేదీన కోనసీమ జిల్లాలోని తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం అత్యంత విజయవంతంగా కొనసాగింది. సమగ్ర సమన్వయం, చక్కటి కార్యాచరణతో ప్రజలతో పాటు ఉన్నతాధికారులను కూడా మెప్పించేలా కార్యక్రమం నిర్వహించబడింది. అనంతరం, జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కూడా మండలంలో విశేషంగా నిర్వహించారు. ఈ రెండు కార్యాచరణల విజయాన్ని స్థానిక పరిపాలనలో మెరుగైన ప్రదర్శనగా గుర్తించిన జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ ఆత్రేయపురం ఎంపిడిఒ బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్ ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జూన్ 25న అమలాపురంలో గోదావరి భవన్, జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన యోగాంధ్ర సక్సెస్ మీట్ లో జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి సమక్షంలో కొత్తపేట డివిజనల్ లో ఉత్తమ ఎంపిడిఓగా గుర్తించి ప్రశంసా పత్రం అందజేశారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలలో స్పష్టత, సమర్థతతో ముందుండే అధికారిగా ఎంపిడిఒ బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్ ఆదర్శంగా నిలిచారు. ఈ పురస్కారాన్ని స్వీకరించిన ఎంపిడిఒ ని మండల పరిషత్ పరిపాలనాధికారి వి. రామస్వరూప్, సీనియర్ సహాయకుడు పి. అనిల్ కుమార్, జూనియర్ సహాయకురాలు ఆర్.ఎస్. ప్రత్యూష, టైపిస్టు పి. పురుషోత్తమ, పంచాయితీ కార్యదర్శులు హృదయపూర్వకంగా అభినందనలు తెలియజేసారు.

## జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ గుర్తింపు సంస్థ వికాస సౌజన్యంతో జూలై ఐదో తేదీన మెగా జాబ్ మేళా.




**జగ్గంపేట జూన్ 26:మనంన్యూస్.** జగ్గంపేట నియోజకవర్గం లోని జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, గోకవరం మండలాలలో ఉన్న నిరుద్యోగ యువతకు బంగారు అవకాశం కల్పిస్తూ కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ కుమార్ నేతృత్వంలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ గుర్తింపు సంస్థ వికాస సౌజన్యంతో జూలై 5వ తేదీ ఉదయం 9 గంటలకు గోకవరం రోడ్డులోని ప్రభుత్వ మోడ్రన్ డిగ్రీ కళాశాలలో ఆవరణలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. 1350 ఖాళీలతో అనేక కంపెనీలు తీసుకొచ్చి నిరుద్యోగ యువతకు ఉద్యోగం అవకాశం కల్పించాలని ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఈ మెగా జాబ్ మేళాలో ప్రతి ఒక్క నిరుద్యోగి ఈ సదా అవకాశాన్ని వినియోగించుకుని ఉద్యోగ అవకాశాలు పొందాలని జ్యోతుల నవీన్ తెలియజేశారు.

## ఎస్సై అశోక్ మృతదేహానికి నివాళులు అర్పించిన బండారు సందీప్.



**ఆలమూరు జూన్ 26 మనం న్యూస్.** కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు యువ నాయకుడు బండారు సందీప్ పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం లోని ఆలమూరు ఎస్సై అశోక్ స్వగృహం వద్ద ఆయన మృతదేహానికి ఘన నివాళులు అర్పించారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, కొత్తపేట డిఎస్పి సుంకర మురళీమోహన్, ఆలమూరు నాయకులతో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్సై కుటుంబానికి సందీప్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## కోర్టు కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- అడిషినల్ కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్



**రాజమహేంద్రవరం, మనం న్యూస్, జూన్ 27:** కోర్టు కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలని.. సకాలంలో కౌంటర్ ఫైళ్ళు, అప్పీలు దాఖలు చేయాలని అడిషినల్ కమిషనర్, లైజనింగ్ ఆఫీసర్ పి.వి.రామలింగేశ్వర్ అన్ని విభాగాల హెచ్ఓడీలను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం ప్రిన్సిపల్ సెక్రటరీ(%హీూఖణ%)తో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో అడిషినల్ కమిషనర్, హెచ్ఓడీలు పాల్గొన్నారు. అనంతరం అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ కోర్టు కేసులకు సంబంధించి అధికారులు వెంటనే స్పందించాలని సూచించారు. అత్యధికంగా టౌన్ ప్లానింగ్ కు సంబంధించి కేసులు పెండింగ్ లో ఉన్నాయని, కనుక అధికారులు వారి పరిధిలోని కేసుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కోర్టు కేసుకు సంబంధించి ప్రాథమిక దశలోనే ప్రభుత్వ ఉత్తర్వులు గాని, సూచనలు గాని కోర్టుకు అందజేసిన యెడల కోర్టు వారు ఆ కేసును అనుమతించరన్నారు. మధ్యంతర ఉత్తర్వులు వచ్చిన యెడల వాటిని అమలు చేసి పక్కాగా రికార్డు చేసుకోవాలన్నారు. చివరి ఉత్తర్వులు వచ్చాక దానిని అమలు చేయడం గాని లేదా అప్పీలుకు వెళ్లాల్సి వస్తే సకాలంలో అప్పీలు వేయాలన్నారు. కోర్టు ధిక్కరణ ఎట్టి పరిస్థితుల్లోనూ కాకూడదని స్పష్టం చేశారు. అలాగే కేసుల మానిటరింగ్ కోసం ప్రతి విభాగంలోనూ సూపరింటెండెంట్, క్లర్క్ ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇకపై ప్రతి గురువారం రివ్యూ జరుగుతుందని.. వచ్చే సమావేశానికి శాఖల వారీగా ప్రోగ్రెస్ చూపాలని ఆదేశించారు. సమావేశంలో అన్ని విభాగాల హెచ్ఓడీలు పాల్గొన్నారు.

## వృద్ధులకు,వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్.. సాయిరాజ్, తాసిల్దార్ పోలవరం..



**పోలవరం, జూన్ 26 (మనం న్యూస్):** చౌక దుకాణాల ద్వారా ప్రతినెలా అందించే రేషన్ సరుకులు వృద్ధులకు, వికలాంగులకు అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వారికి ముందు నెలలోనే 26వ తారీకు నుండి 30 వతారీకు వరకు వారి ఇంటి వద్దకే వెళ్లి అందించడం జరుగుతుందని పోలవరం తహసిల్దార్ సాయిరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జూన్ 26వ తేదీ నుండి ప్రారంభం కాగా మొదటి రోజు మండలంలోని పాతపట్టిసీమలో వృద్ధులు, వికలాంగుల ఇళ్లకు వెళ్లి స్వయంగా రేషన్ సరుకులు అంద చేసినట్లు పోలవరం తాసిల్దార్ సాయిరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా తహసిల్దార్ సాయిరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో వృద్ధులకు వికలాంగులకు, అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వారికి ఏ విధమైన ఇబ్బంది కలగకుండ వారి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరుకులు అందించడం జరుగుతుందన్నారు. రేషన్ డీలర్లకు వారి పరిధిలోని వృద్ధులు వికలాంగులు, అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వారిని గుర్తించి నెల ముందే వారి ఇంటికి వెళ్లి రేషన్ సరుకులు అందవ్వాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. అనారోగ్యంతో బాధపడేవారు రేషన్ డీలర్లకు సమాచారం అందిస్తే డీలర్లు రేషన్ సరుకులు వారి ఇంటికి తీసుకు వస్తారన్నారు. మిగిలిన వారికి రేషన్ దుకాణాల వద్ద యధావిధిగా 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు రేషన్ సరుకులు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. తహసిల్దార్ సాయిరాజు వెంట విఆర్ఓ వినయ్ కుమార్, రేషన్ డీలర్ ఉన్నారు.

# అట్టహాసంగా అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు శంకుస్థాపన

- త్వరలో గోదావరి పరివాహాక ప్రాంతాలకు కొత్త సొబగులు

- సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఏపీలో టూరిజంల ప్రాజెక్టులకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎంపీ పురందేశ్వరీ, మంత్రి కందుల దుర్గేష్ లు కృషి చేస్తున్నారన్న కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్

- ఏపీకి దాదాపు రూ.450 కోట్లతో 7 టూరిజం ప్రాజెక్టులు మంజూరు ..

పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో ఏపీలో పర్యాటకాభివృద్ధి జరుగుతుందన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

- అఖండ గోదావరి ప్రాజెక్టుతో అధ్యాత్మిక, సాంస్కృతిక, చారిత్రక రాజధాని రాజమహేంద్రవరం, పరిసర ప్రాంతాలకు మరింత శోభ తెస్తామన్న మంత్రి కందుల దుర్గేష్

- రాష్ట్రాన్ని విధ్వంసం నుండి నిర్మాణం వైపు నడిపించే దిశ లో కూటమి ప్రభుత్వం టూరిజానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్న జిల్లా ఇంచార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు

- వికసిత్ రాజమహేంద్రవరంలో భాగమే అఖండ గోదావరి ప్రాజెక్టు..2047 పుష్కరాల నాటికి అఖండ గోదావరి ప్రాజెక్టు పూర్తి చేసి రాజమండ్రిని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని పురందేశ్వరీ హామీ

- పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ పనితీరును ప్రశంసించిన వక్తలు







**రాజమహేంద్రవరం, మనం న్యూస్, జూన్ 26 :** రూ.94.44 కోట్లతో రాజమహేంద్రవరంలోని పుష్కర్ ఘాట్ చెంతన కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎంపీ పురందేశ్వరీ, మంత్రి కందుల దుర్గేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో అట్టహాసంగా అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగింది.తొలుత సభావేదిక ఆవరణలో అఖండ గోదావరి పర్యాటక విశేషాలు తెలుపుతూ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను కేంద్ర, రాష్ట్ర మంత్రులు, అధికారులు సందర్శించారు. అంతకుముందు రాజమహేంద్రవరం సమీపంలోని మధురపూడి విమానాశ్రయంలో మంత్రి కందుల దుర్గేష్ కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ కు ఘన స్వాగతం పలికారు. అనంతరం రాజమండ్రికి తొలిసారి వచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు కూటమి శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా అఖండ గోదావరి ప్రాజెక్టుతో చారిత్రక నగరం రాజమహేంద్రవరం ఇకపై అంతర్జాతీయ, దేశ, రాష్ట్ర పర్యాటకులతో పర్యాటక శోభను సంతరించుకోనుందని వక్తలు ఉద్ఘాటించారు. 2047 పుష్కరాల నాటికి అఖండ గోదావరి ప్రాజెక్టు పూర్తి అయి పర్యాటకులకు అందుబాటులోకి రానుందన్నారు.తద్వారా స్థానికంగా హెూటళ్లు, రెస్టారెంట్లు, రవాణా, ఇతర రంగాలు విస్తరించడం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 8వేల మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశముందన్నారు. ఈ సందర్భంగా కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి ప్రాజెక్టు కు శంకుస్థాపన జరగడం చాలా సంతోషంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అభ్యర్థన మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో నేడు ఎన్నో ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసుకుంటున్నామని తెలిపారు. ఏపీలో ప్రాజెక్టుల రూపకల్పనకు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ పురందేశ్వరీలు కృషి చేస్తున్నారని ప్రశంసించారు. చారిత్రాక నగరి అయిన రాజమండ్రిలో కొలువై ఉన్న పుష్కర్ ఘాట్ ను అధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. డిప్యూటీ సీఎం, ఎంపీ పురందేశ్వరీ, పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ ల చొరవతో ఏపీలో పర్యాటక రంగ అభివృద్ధికి దాదాపు రూ.450 కోట్లకు పైగా నిధులు మంజూరు చేశామన్నారు. స్వదేశీ దర్శన్, ప్రసాద్, శాస్కి, ఛాలెంజ్ బేస్డ్ డెస్టినేషన్ డెవలప్ మెంట్(సీబీడీడీ) తదితర స్కీమ్ ల ద్వారా పర్యాటక రంగ అభివృద్ధికి కేంద్రం దోహదం చేస్తుందని, తద్వారా భారతదేశాన్ని పర్యాటకుల గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఏపీలో స్వదేశీ దర్శన్ స్కీమ్ ద్వారా 2015-17లో కాకినాడ హెూప్ ఐల్యాండ్,కోరింగ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం, పులికాట్ సరస్సు, మైపాడు బీచ్, ఇసుకపల్లి లో సర్క్యూట్, బుద్ధిస్ట్ సర్క్యూట్ లో భాగంగా శాలిహుండం, బావికొండ,అమరావతికి సహకారం అందించామని పేర్కొన్నారు. స్వదేశీ దర్శన్ 2.0 ద్వారా అరకు, బొర్రా గుహలు, లంబసింగి, సూర్యలంక బీచ్ లను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. పర్యాటకులకు సాహస పర్యాటక అనుభవాలను అందిస్తున్నామన్నారు. ప్రసాద్ స్కీమ్ ద్వారా అధ్యాత్మిక టూరిజానికి బాటలు వేస్తున్నామన్నారు..అమరావతి, శ్రీశైలం దేవాలయాల్లో భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని, సింహాచలం వరాహ లక్ష్మీ నర్సింహస్వామి దేవస్థానంలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాన్నారు. ఆ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్యని పేర్కొన్నారు. అన్నవరం దేవాలయంలో టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు.శాస్కి (స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్మెంట్ ) స్కీమ్ ద్వారా అఖండ గోదావరి ప్రాజెక్టు అభివృద్ధికి దాదాపు రూ.95 కోట్ల నిధులు కేటాయించామని, తద్వారా పర్యాటకులకు ఆహ్లాదాన్ని అందించేందుకు, హేవలాక్ బ్రిడ్జి, పుష్కర్ ఘాట్ ల అభివృద్ధికి నిధులు ఖర్చు చేయనున్నామన్నారు. హేవలాక్ బ్రిడ్జిని మల్టీ ఫంక్షనల్ టూరిస్ట్ హబ్ గా తీర్చిదిద్ది, దాదాపు 1.2 కి.మీల పొడవునా ఉన్న స్పాన్ లలో థీమ్ పార్కులు అభివృద్ధి చేస్తామన్నారు . అంతేగాక రాజమండ్రి, ఏపీ చరిత్రను తెలుపుతామన్నారు. 120 ఎకరాల్లో బ్రిడ్జిలంకను వృద్ధి చేస్తామని, బోటింగ్ తో పాటు టెంట్ సిటీ ఏర్పాటు చేస్తామన్నారు. నిత్యహారతిలో భాగంగా గోదావరి హారతి ఘాట్ ను అధ్యాత్మిక కేంద్రంగా మారుస్తామన్నారు. కడియం నర్సరీలను ఎక్స్ పీరియన్స్ సెంటర్ గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కడియపులంకను అభివృద్ధి చేస్తామని, క్రూయిజ్ టూరిజం అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గోదావరి కాలువలో బోటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. తొలుత ఏటా 10-15 లక్షల మంది పర్యాటకులు సందర్శించేలా అఖండ గోదావరి ప్రాజెక్టును తీర్చిదిద్దబోతున్నామన్నారు. 2035నాటికి 35 లక్షల మంది పర్యాటకుల లక్ష్యంగా చర్యలు తీసుకుంటామన్నారు.అఖండ గోదావరి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి దేశంలోనే ప్రఖ్యాత స్పాట్ గా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ఇవేగాక పుట్టపర్తి, అరకులలో లైట్స్ అండ్ సౌండ్ షో ఏర్పాటుతో పాటు వైజాగ్ పోర్టులో క్రూయిజ్ అండ్ కార్గో టర్మినల్, తిరుపతి రైల్వే స్టేషన్ ఆధునికీకరిస్తున్నట్లు వెల్లడించారు.పర్యాటక, అతిథ్య రంగాలు సుస్థిర అభివృద్ధి చెందాలన్నదే తమ ధ్యేయమన్నారు. పర్యాటక రంగ అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మెండుగా అవకాశాలు, వనరులున్నాయని,తద్వారా ఉపాధి అవకాశాలు విస్తృతంగా వస్తాయని తెలిపారు.ఏపీలో బుద్ధిస్ట్ సర్క్యూట్, కోస్టల్ లో ఎకో టూరిజం ఏర్పాటు చేస్తామని, పీపీపీ విధానంలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి కందుల దుర్గేష్ తో పాటు పలువురి అభ్యర్థనల మేరకు రాజమండ్రి నగరాన్ని వారసత్వ సాంస్కృతిక రాజధాని గా గుర్తింపు కు చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. డబుల్ ఇంజిన్ సర్కార్ తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో,ఏపీ రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని, 2023లో టూరిజం రంగం దేశ ఎకానమీకి 10 శాతం ఆదాయం అందించిందని వివరించారు.అంతర్జాతీయ పర్యాటకుల ఆకర్షణలో భారతదేశం మెరుగైన స్థానం సంపాదించాలని భావిస్తున్నామని, ఇప్పటికే ఆదిశగా అడుగులు వేశామన్నారు..దేశంలో పర్యాటకుల సందర్శన క్రమక్రమంగా పెరుగుతుందని, ప్రపంచవ్యాప్తంగా పర్యాటకుల శాతం వేగంగా పెరిగింది భారతదేశంలో మాత్రమేనని స్పష్టం చేశారు. తాము చేస్తున్న ప్రయత్నాల వల్ల ప్రపంచ ఆర్థిక టూరిజం అండ్ ట్రావెల్ డెవలప్ మెంట్ ఇండెక్స్ లో 54వ స్థానంలో ఉన్న ఇండియా 39వ స్థానానికి చేరుకుందని, టాప్ 10 దేశాల్లో ఒకటిగా నిలవాలన్నదే తమ లక్ష్యమన్నారు. 2047 నాటికి భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రధాని మోదీ నాయకత్వంలో ఇండియాలో 3 ట్రిలియన్స్ డాలర్ల ఎకానమీ అభివృద్ధి జరగాలి..టూరిజం రంగం ద్వారా 10 శాతం జాతీయ జీడీపీకి అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. భారతదేశం 2047 నాటికి వికసిత్ భారత్ గా విరాజిల్లుతుందని తెలిపారు. ఈ సందర్భంగా అఖండ గోదావరి ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమం విజయవంతం చేసినందుకు జిల్లా అధికార యంత్రాంగాన్ని, స్థానిక ప్రజాప్రతినిధులను, ప్రజానీకాన్ని అభినందిస్తున్నానని కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ రాజమండ్రి అనగానే గుర్తొచ్చేది గోదావరి తీరమన్నారు. తీరం వెంబడి నాగరికత, నాగరికత ఉన్న చోట భాష వృద్ధి చెందుతాయని అభిప్రాయపడ్డారు. అలాంటి ఈ నేల ఆంధ్రుల అన్నపూర్ణగా పేర్గాంచిన డొక్కా సీతమకు, మహాభారతాన్ని తెలుగులో అందించిన ఆదికవి నన్నయకు, ఎంతో మంది కళాకారులకు,సామాజిక వేత్తలకు,బాపు-రమణల్లో ఒకరైన ముళ్లపూడి వెంకటరమణ తదితర ఎందరో గొప్ప వ్యక్తులకు జన్మనిచ్చిందని తెలిపారు. హేవలాక్ బ్రిడ్జి చాలా పురాతనమైందని, చాన్నాళ్లుగా నిరుపయోగంగా ఉందని, దీన్ని బాగుచేసుకొని టూరిజం ప్రాజెక్టుగా వినియోగించుకోవాలన్నది చాలా దశాబ్దాలుగా గోదావరి ప్రజల ఆకాంక్ష, కల అని తెలుపుతూ ఈ కలను సాకారం చేసే దిశగా ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. దాదాపు రూ.450 కోట్లతో 7 టూరిజం ప్రాజెక్టుల పనులు ప్రారంభిస్తున్నామన్నారు. ఏపీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని 2024 ఎన్నికల సమయంలో ఎన్డీయే సర్కార్ నిర్ణయించిందని, అందులో భాగమే అఖండ గోదావరి ప్రాజెక్టు అని తెలిపారు. పర్యాటక రంగంలో యువతకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే వందల సంఖ్యలో ఉపాధి దొరుకుతుందన్నారు. రాష్ట్రంలో టూరిజం ప్రాజెక్టులు పూర్తయితే దాదాపు 4 లక్షల మందికి ఉపాధి అవకాశాలు దొరుకుతాయని వివరించారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే పదం కాదు..శక్తివంతమైన ప్రభుత్వం అని అర్థం చెప్పారు. రాష్ట్రంలో, కేంద్రంలో శక్తివంతమైన ప్రభుత్వాలు ఉండటం వల్ల ప్రాజెక్టులు సులువుగా వస్తాయని, త్వరగా పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందందన్నారు. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మొదటి నుండి ఏపీకి సంపూర్ణ సహకారం అందిస్తున్నారని గుర్తుచేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కాపాడటంలో, నాపోలవరం ప్రాజెక్టు విషయంలో, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా కాపాడారని స్పష్టం గుర్తుచేశారు. ఏపీ అభివృద్ధికి కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సహకారం ఎప్పుడూ ఉంటుందని, ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఏపీకి 974 కి.మీల సుదీర్ఘ సముద్రతీరం, గోదావరి, కృష్ణా, వంశధార, నాగావళి, ఇంకా ఎన్నో చిన్న నదులు ఉన్నాయని తెలుపుతూ నదీ పరివాహక ప్రాంతాల్లో రివర్ ఫ్రంట్ ఏరియా ఉంటుందని, విదేశాల్లో ఈ ప్రాంతాన్ని టూరిజం స్పాట్ లుగా అభివృద్ధి చేసుకుంటున్నారన్నారు..ఏపీలో నదులు సంస్కృతిలో భాగమని, ఈ క్రమంలో పుష్కర్ ఘాట్ అభివృద్ధితో పాటు చారిత్రక, కళా, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. అన్నవరం, గండికోట, శ్రీశైలం తదితర ప్రాంతాలు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో అభివృద్ధి చెందుతున్నాయన్నారు.ఇటీవల విదేశాల పర్యటనకు దుర్గేష్ వెళ్లి వచ్చారు.. పవిత్ర బుద్ధ భగవానుని అవశేషాలను వియత్నాం దేశానికి తీసుకెళ్లారని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి సహకారంతో 2035 నాటికి 35 లక్షల మంది పర్యాటకులను అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు ద్వారా ఆకర్షించేలా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పర్యాటక కేంద్రాలకు పునరుజ్జీవం పోసేలా ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వం, పర్యాటక రంగాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాలి అన్న ఆలోచనతో ఉన్న నేలబిడ్డ కందుల దుర్గేష్ ల సారథ్యంలో పర్యాటక రంగం ముందుకు వెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అఖండ గోదావరి ప్రాజెక్టుకు ముందుండి సహకారం అందించిన ఎంపీ పురందేశ్వరీ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. వీరులు పుట్టిన నేల రాజస్థాన్ నుండి కేంద్రమంత్రి షెకావత్ వచ్చారని, అంత పౌరుషం ఉన్న నేల అంతే పౌరుషం ఉన్న ఆంధ్రప్రదేశ్ నేల స్వభావాన్ని అర్థం చేసుకుందని ఉదహరిస్తూ కేంద్ర మంత్రి షెకావత్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంటే అభివృద్ధి పరుగులు తీస్తుందని చెప్పాం..ప్రజలు విశ్వసించి ఎన్డీయే కూటమిని గెలిపించారు.. అందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ చిరకాల స్వప్నమైన వికసిత్ భారత్ లో వికసిత్ ఆంధ్రప్రదేశ్ ఒక భాగమని అందరూ గుర్తించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుండి అమరావతి రాజధాని నిర్మాణం మొదలుకొని పోలవరం ప్రాజెక్టు, విశాఖ రైల్వేజోన్, స్టీల్ ప్లాంట్, ఎంఎన్ఆర్ఈజీఎస్ నిధులు ఇలా అన్నింటికి ప్రోత్సాహం ఇస్తూ అన్ని విధాల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని పేర్కొన్నారు. వికసిత్ ఆంధ్రరాష్ట్రం కావాలంటే వికసిత్ జిల్లాలు కావాలి..అంటే వికసిత్ రాజమహేంద్రవరం వికసిత్ ఆంధ్రప్రదేశ్ లో భాగమని గుర్తించాలని కోరారు. వికసిత్ రాజమహేంద్రవరంలో భాగంగానే అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు శంకుస్థాపనతో పాటు పలు ప్రాజెక్టులు ప్రారంభించడం జరుగుతోందని,100 ఏళ్లకు పైగా చరిత్ర కలిగి నిరుపయోగంగా ఉన్న హేవలాక్ వంతెన ప్రాధాన్యతను కేంద్రం గుర్తించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తోందన్నారు. గోదావరి రివర్ ఫ్రంట్ అభివృద్ధిలో భాగంగా విగ్రహాలు తొలగించకుండా అభివృద్ధిని చేయాలని పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్ కు సూచించామని వివరించారు. 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని నేడు అఖండ గోదావరి ప్రాజెక్టులో భాగంగా పుష్కర్ ఘాట్ ను అభివృద్ధి చేయనున్నామని తెలిపారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ రాజమహేంద్రవరాన్ని చారిత్రక, సాంస్కృతిక రాజధానిగా గుర్తించాలని అభ్యర్థించారు..ఇప్పటికే ఈ అంశాన్ని తాను పార్లమెంట్ లో లేవనెత్తాను..రాజమహేంద్రవరాన్ని హెరిటేజ్ సిటీగా గుర్తించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాజమహేంద్రవరాన్ని పర్యాటకంగా, అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నాం..ఆ దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. గౌతమీ లైబ్రరీ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలుపుకుంటూ రాజమహేంద్రవరం అభివృద్ధికి కచ్చితంగా తన వంతు సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు.

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అఖండ గోదావరి ప్రాజెక్టుతో అధ్యాత్మిక, సాంస్కృతిక, చారిత్రక రాజధాని రాజమహేంద్రవరం, పరిసర ప్రాంతాలకు మరింత శోభ తెస్తామన్నారు. ఉభయగోదావరి జిల్లాల పర్యాటక కేంద్ర ప్రాజెక్టు ఈ అఖండ గోదావరి అని తెలిపారు. రూ.94.44 కోట్ల అంచనా వ్యయంతో అఖండ గోదావరి ప్రాజెక్టుకు శంకుస్థాపన జరగడం శుభ సందర్భంగా భావిస్తున్నామని ఆనందం వ్యక్తం చేశారు. ప్రాజెక్టులో భాగంగా హేవలాక్ బ్రిడ్జి, బ్రిడ్జిలంక, పుష్కర్ ఘాట్, కడియం నర్సరీలు, నిడదవోలు కోట సత్తెమ్మ దేవాలయం,గోదావరి కాలువను సర్క్యూట్ గా ఏర్పాటు చేయనున్నామని వివరించారు. అఖండ గోదావరి ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ తయారు చేసుకొని కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ను న్యూఢిల్లీలో కలిశామని, తొలి నుండి కేంద్ర మంత్రి షెకావత్ సంపూర్ణ సహకారం అందించి ప్రాజెక్టును ముందుకు తీసుకువచ్చారన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా సీఎం చంద్రబాబునాయుడు ఆలోచనల మేరకు ఈ ప్రాజెక్టును మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక చొరవ చూపించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎంపీ పురందేశ్వరీలకు ధన్యవాదాలు తెలిపారు.

అఖండ గోదావరి ప్రాజెక్టు శంకుస్థాపనకు విచ్చేసిన షెకావత్ తో డిప్యూటీ సీఎం అయ్యాక తొలిసారి రాజమహేంద్రవరానికి విచ్చేసిన పవన్ కళ్యాణ్ కు, కార్యక్రమంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. 127 ఏళ్ల క్రితం బ్రిటీష్ వారు నిర్మించిన హేవలాక్ వంతెనను సుందర పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. హేవలాక్ వంతెనను కొత్త రూపు తేవాలన్న ఆలోచనకు చాలా కాలంగా ప్రయత్నాలు జరుగుతున్నా కార్యరూపం దాల్చలేదని, ఈ ప్రయత్నాలను కార్యరూపంలోకి తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం వేస్తున్న తొలి మెట్టు అఖండ గోదావరి ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ప్రాజెక్టులో భాగంగా పిచ్చుకలంకను, గోదావరి పరిసర ప్రాంతాలను అద్భుతంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరానికి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఇవ్వాలని, చారిత్రక, సాంస్కృతిక నగరంగా రాజమహేంద్రవరాన్ని గుర్తించాలని కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కి విజ్ఞప్తి చేశారు. అంతేగాక రాజమహేంద్రవరానికి మరింత ప్రోత్సాహం అందించి మెరుగైన నగరంగా తీర్చిదిద్దాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను కోరారు. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలను టూరిజం హబ్ గా ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీ పురందేశ్వరిని మంత్రి దుర్గేష్ కోరారు. రాజమహేంద్రవరం చరిత్ర, సంస్కృతిని పునరుజ్జీవింపజేయాలని ప్రజలను కోరారు.తూర్పు గోదావరి జిల్లా ఇంచార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ తూర్పు పర్యాటకానికి సింహ ద్వారంగా ఉన్న రాజమహేంద్రవరం చారిత్రాత్మక వైభవాన్ని, ప్రపంచ వ్యాప్తం చేసేలా అఖండ గోదావరి ప్రాజెక్ట్ తీసుకురావడం శుభపరిణామమన్నారు. 2014 లో జరిగిన రాష్ట్ర విభజన కంటే, 2019-24 మధ్య 5 ఏళ్ళ పాలనలోనే రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరిగిందన్నారు. రాష్ట్రాన్ని విధ్వంసం నుండి నిర్మాణం వైపు నడిపించే దిశలో కూటమి ప్రభుత్వం టూరిజానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అందులో భాగంగా ఉత్తరాంధ్ర విశాఖ అందాల తీరం నుండి, రాయలసీమ లోని గండికోట, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పర్యాటక అందాలను, టెంపుల్ టూరిజాన్ని కలుపుతూ పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2027 డిసెంబర్ నాటికి పూర్తయ్యే పోలవరం ప్రాజెక్ట్ ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. టూరిజాన్ని అభివృద్ధి చేసి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేలా, సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల కష్టానికి, ప్రధాని నరేంద్ర మోదీ సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్ మాట్లాడుతూ గోదావరి జిల్లాల ప్రజల చిరకాల వాంఛ అయిన అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు శంకుస్థాపన జరగడం ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకుతో పాటు రూ.450 కోట్లకు పైగా విలువైన పర్యాటక ప్రాజెక్టులు మంజూరు చేసినందుకు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. సకాలంలో ఈ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు, బొలిశెట్టి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ,చిర్రి బాలరాజు, మద్దిపాటి వెంకటరాజు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ముప్పిడి వెంకటేశ్వర రావు, ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్, సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి, ఎస్పీ డి. నరసింహ కిషోర్, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

